



# మూడవ భాగము

"స్కౌండ్రల్స్! ఇంత దారుణంగా హత్యలు చెయ్యగలిగిన మీరు నన్ను మాత్రం ప్రాణాలతో తిరిగి పోనిస్తారా? నన్ను మీరు చంపుతారు. మీ చేతుల్లో చావడం కన్నా సముద్రంలో దూకిచావడం మంచిది" అంది డెల్లా.

"దూకనీ! ఛస్తుంది. ఆ ముండతో మనకేం పనుంది" అన్నాడు రెండో డెవిల్, మొదటి డెవిల్ తెచ్చిన సూట్ కేస్ తెరచి చూసుకుంటూ.

"నో! అలా జరిగేందుకు వీల్లేదు. ఆమెకు ఇండియా చూపిస్తానని మాటిచ్చాను. మీరేమైనా నాకు అనవసరం. ఆమెకు ఇచ్చిన మాట నిలబెట్టుకొంటాను" అన్నాను నేను.

"మాక్కావలసింది దొరికింది. నీతోగూడా మాకు పని లేదు. నీ దోవ నువ్వు చూసుకో!" అన్నారిద్దరూ ముక్తకంఠంతో.

"ఓ. కే. తీరం చేరేదాకే మనం ఫ్రెండ్స్. ఆ తర్వాత ఎవరి త్రోవలు వాళ్ళవి" అన్నాను నేను డెల్లా ప్రక్కగా వెళ్ళి కూర్చుంటూ.

"యూ సీమ్ టు బి ఎ గుడ్ మన్!" అంది డెల్లా నా కేసి చూసి.

ఆమె చెయ్యి నా చేతిలోకి తీసుకొని, ధైర్యం చెప్పాను. బోటు వెనక్కి కదిలింది. వాళ్ళిద్దరూ టార్చిలైట్లు వెనక్కి చూపసాగారు. షిప్ పైనుండి పెద్ద లైటొకటి వెలిగింది సముద్రంపైని నీళ్ళలో మెరిసిపోతూ.

"మా వాళ్ళు రానందుకు షిప్ లో కంగారుపడుతున్నట్టున్నారు. అందుకే సెర్చిలైటు వెలిగించారు" అంది డెల్లా.

"వాళ్ళు తిరిగి షిప్ చేరకపోతే ఏం చేస్తారు?" అడిగాను నేను.

"వెతుక్కుంటూ వస్తారు. పవర్ ఫుల్ మోటార్ బోట్ వుంది. దాన్నిండా కావలసినంత మందు గుండు సామగ్రి వుంది. మిమ్మల్ని ప్రాణాలతో సముద్రం దాట నివ్వరు" చెప్పింది డెల్లా.

ఆమె చెప్పిన మాటలు డెవిల్స్ రెండూ విన్నాయి.

"వాళ్ళను చంపకుండా వుండవలసింది" అన్నాను నేను.

"మిస్టర్ రాజ్! మనకొచ్చిన భయమేమీ లేదు. డెల్లా మన చేతుల్లో వుంది. వాళ్ళు అనవసరంగా మనపైకి వస్తే, మనం డెల్లాని కాల్చి చంపుతామని బెదిరిద్దాం. దాంతో కిక్కురుమనకుండా వెనక్కి వెళ్ళిపోతారు" అన్నాడు మొదటి డెవిల్.

మా బోటు తీరం వేపు స్పీడుగా పోసాగింది. మా గ్యాంగ్ వాళ్ళ బోటుకూడా వెనక్కి కదిలిపోసాగింది.

ఇంతలో చీకటిని తరుముతూ, తీరం వేపునుండి పెద్ద

కాంతి సముద్రాన్ని వెలిగించింది. మాకు కళ్ళుకూడా కనిపించలేదు. నీళ్ళను చీల్చుకుంటూ ఏదోకదలి మా వైపు రాసాగింది. నేను పరీక్షగా చూశాను.

"అటునుండి మోటర్ బోటు ఏదో మనవైపు వస్తోంది" అన్నాడు రెండో డెవిల్.

"మా గ్యాంగ్ దేమో?" అన్నాను నేను.

"కాదు!"

"అయితే ఎక్సైజ్ వాళ్ళదయి వుంటుంది. మనం ఇప్పుడు ట్రాప్ లో పడ్డాం. సముద్రంలోకి వెళ్తే షిప్ లో వాళ్ళు కాల్చిచంపుతారు. తీరంవైపుపోతే ఎక్సైజ్ వాళ్లు పట్టుకుంటారు. మూడోవైపు మావాళ్ళున్నారు. ఏం చెయ్యడం?" అడిగాను నేను. మొదటిసారిగా అధైర్యం నాలో చోటుచేసుకుంది. నా ముందుకూర్చున్న డెల్లా విచారంగా తలవంచుకుంది.

"నేను ఇవాళ రాకుండా వుండవలసింది" అంది డెల్లా.

"డోన్ట్ వరీ! నేనున్నాను. నా ప్రాణాలు పోనంత వరకు, నిన్ను రక్షించే పూచీనాది" ఆమె చెయ్యి నా చేతుల్లోకి తీసుకొని మెల్లగా రాస్తూ చెప్పాను.

డెల్లా కళ్ళు ఆనందంతో మెరిసాయి. నావేపు కృతజ్ఞతగా చూసిందామె.

మాబోటు స్పీడు తగ్గించాను. ఎక్సైజ్ అధికారులున్న బోటు రయ్యమని వచ్చేస్తూనే వుంది.

డెవిల్స్ ఇద్దరూ కాలుగాలిన పిల్లుల్లా అటూ, ఇటూ, క్రిందకీ పైకీ తిరగసాగారు. మాటిమాటికీ మిషిన్ గన్ లు తీసి చూసుకోసాగారు. వాళ్ళకు ఏం చెయ్యనూ తోచినట్లు లేదు.

"మనదగ్గర ఎక్కువ అమ్యూనిషన్ కూడా లేదు. చాలావరకు ఖర్చయిపోయింది. షిప్ లోవున్న వాళ్ళ

తోనూ, ఎక్సయిజ్ వాళ్ళతోనూ మనం యుద్ధం చెయ్యలేమనుకుంటాను" అన్నాడు మొదటి డెవిల్.

"ఉన్నంతవరకు చూద్దాం! ఆ తర్వాత అంతా దేవుడెలా రాసిపెట్టివుంటే అలా అవుతుంది" అన్నాడు రెండోవాడు.

వీళ్ళకు దేవుడిమీద నమ్మకం వుండడం నాకు నిజంగా ఆశ్చర్యాన్ని కలిగించింది. డెల్లా షిప్ కేసి చూసింది. లైట్లన్నీ వెలుగుతున్నాయి. జనం హడావిడిగా తిరగటం స్పష్టంగా కనుపించసాగింది.

"ఎందుకలా జనం కంగారుపడుతున్నారు" అడిగాను నేను.

"ఏమో?" అంది డెల్లా.

"మరి మీ వాళ్ళెవరూ వస్తున్నట్టులేదే!"

"వస్తారు. వాళ్ళదగ్గర హెలికాప్టర్ గూడా వుంది. అంతమంది తిరుగుతున్నారంటే బహుశా హెలికాప్టర్ ని సిద్ధం చేస్తుండవచ్చు."

"అయితే మనం తప్పించుకోలేం. మోటార్ బోట్ అన్నా అయితే ఎలాగో ప్రయత్నించవచ్చు."

"షిప్ లో హెలికాప్టర్ వుందా!" డెవిల్, డెల్లా దగ్గరకొచ్చి నిలబడ్డాడు అడుగుతూ.

ఆమె జరిగి నన్నానుకుంటూ కూర్చుని "వుంది!" అంది.

ఎక్సయిజ్ వాళ్ళ బోటులోంచి నిశ్శబ్దాన్ని చీలుస్తూ మొదటి షాట్ ప్రేలింది. గుండు మా బోటు పైగా దూసుకు వెళ్ళింది.

యుద్ధం ప్రారంభమయింది.

డెవిల్స్ ఇద్దరూ అంతకు ముందులాగే క్రిందొకరు పైనొకరు చేరారు. ఫైరింగ్ మొదలెట్టారు. మా బోట్ ను

వెనక్కి పోనిమ్మన్నారు. నేను వాళ్లు చెప్పినట్టే చేశాను. వాళ్ళ హడావిడిలో వాళ్ళున్నారు. డెల్లా నా ప్రక్కగా వచ్చింది. సముద్రంకేసి రెండుక్షణాలు చూసింది.

"మిస్టర్ రాజ్!" అని పిలిచింది.

ఏమిటన్నట్లు చూశాను. తన నోరు నా చెవిదగ్గర పెట్టి "వీళ్ళిద్దర్నీ వదలించుకుంటే మనం తప్పించుకోవచ్చు" అంది.

"ఎలా?" అడిగాడు.

"మా వాళ్లు హెలికాప్టర్ లో వస్తారు. ముందు ఎక్సైజ్ వాళ్ళ బోట్ ను అటాక్ చేస్తారు. ఆ తర్వాత మన బోట్ ను సముద్రంలో ముంచుతారు. మనం ఈలోగా "వీళ్ళను హతమార్చాలి. ఆ తర్వాత ఈదుకుంటూ షిప్ లోకి పోవచ్చు. నీకే ఆపదా రాకుండా నేను వాళ్ళతో చెప్పి కాపాడుతాను" అంది డెల్లా.

"నా దగ్గర ఆయుధాలు లేవు. వీళ్లు సామాన్యులు కారు" చెప్పాను నిరాశగా.

"నాకద్ద రివాల్వరుంది. ఇచ్చేదా?" అంది.

ఇమ్మని సైగ చేశాను.

ఆమె బనీన్ లో మెడ క్రిందుగా చెయ్యి పెట్టింది. రొమ్ములను బిగించి కట్టిన బ్రాసరీలోకి చెయ్యిపోనిచ్చింది. చిన్న రివాల్వరు తీసింది. అంత చిన్న రివాల్వరు అంతకు ముందెప్పుడు నేను చూడలేదు. పిల్లలు ఆడుకునే టాయ్ రివాల్వర్ లాగుంది. నాకు దాన్ని అందించింది. తీసి జేబులో వేసుకున్నాను.

"దానికి సైలెన్సర్ వుంది" చెప్పింది డెల్లా.

షిప్ లోంచి 'జుయ్యి'మని గాలిని చీలుస్తూ తిరిగిన ప్రొఫెల్లర్ శబ్దం వినవచ్చింది.

"హెలికాప్టర్ బయులుదేరుతూంది" చప్పట్లుకొడుతూ

చిన్న పిల్లలా ఎగురుతూ చెప్పింది డెల్లా. ఆమెను అలా చెయ్యొద్దని హెచ్చరించాను. స్టీరింగ్ వీల్ దగ్గర డెల్లా నుండమని నేను డెక్ పైకెళ్ళాను. మొదటి డెవిల్ బోర్లా పడుకుని వున్నాడు.

నేను వెళ్ళి అతని ప్రక్కనే కూర్చున్నాను. అతను నాకేసి చూశాడు.

"ఆ బోటులో ఎవరన్నా చచ్చారా?" అడిగాను.

"పది రౌండ్లు పేల్చాను. ఎవ్వరూ చచ్చినట్లు లేదు. ఆ బోట్ కు ముందేదో పెద్ద గ్లాసులాంటి దున్నట్లుంది. గమనించి చూడు" అన్నాడు అతను.

కళ్లు చిట్లించి చూశాను. అతను చెప్పింది నిజమే.

"బుల్లెట్ ప్రూఫ్ గ్లాసులాగుంది" అన్నాను నేను.

"అయితే మన అమ్యూనిషన్ అంతా వేస్టే. వాళ్ళను కాల్చి ప్రయోజనంలేదు" అన్నాడు లేస్తూ.

"మనం వీళ్ళ బారినుండి తప్పించుకునే మార్గం లేనట్లేనా?" అడిగాను నేను.

"ఏది ఏమైనా ప్రాణాలతో వాళ్ళకు చిక్కకూడదు."

దిగి క్రిందకు పోయేందుకు మెట్లు దిగసాగాడు. డెల్లా ఇచ్చిన రివాల్వరు మెల్లగా తీశాను. వెనుకనుండి గురి చూసి కాల్చాను.

"అమ్మా" అంటూ గిరగిర తిరుగుతూ క్రిందపడి పోయేడు బోట్ లోకి.

రివాల్వరు వెంటనే జేబులో వేసుకున్నాను. మెట్ల దగ్గరకు పరుగెత్తుకెళ్ళాను. చకచక మెట్లుదిగి క్రింద కొచ్చాను. రక్తపు మడుగులో పడి వున్నాడు. అతని ప్రాణాలు క్షణంలో పోయాయి. రెండో డెవిల్ వచ్చి అతని ప్రక్కన నిలబడ్డాడు.

—(సశేషం)